హనుమాన్ స్వాములకు భిక్ష

పూజలు నిర్వహిస్తున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

రెంజల్, ఏప్రిల్ 7: మండలంలోని నీలాక్యాంప్ గ్రామంలో ఆదివారం హనుమాన్ మాల ధరించిన స్వాములకు నిజామాబాద్ స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు హాజరై హనుమాన్ స్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. 41 రోజులపాటు నియమనిష్టలతో హనుమాన్ దీక్ష చేపట్టిన స్వాములు అదృష్టవంతులని అన్నారు. కార్యక్రమంలో స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, కేసీఆర్ సేవాదల్ అధ్యక్షుడు రమణారావు, బీఆర్ఎస్ నవీపేట మండలాధ్యక్షుడు నర్సింగ్‌రావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మేక సంతోష్, మండల గురు స్వాములు నాగభూషణం, పోతన్న, మోహన్, రాము తదితరులు పాల్గొన్నారు.

టీఏ, డీఏ చెల్లించాలని వినతి

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 7 : పదోతరగతి పరీక్ష సమాధాన పత్రాల మూల్యాంకనంలో స్పెషల్ అసిస్టెంట్లగా విధులు నిర్వర్తిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులకు టీఏ, డీఏ చెల్లించాలని జిల్లా విద్యాశాఖాధికారి దుర్గాప్రసాద్‌కు వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యక్షుడు శ్యామ్, గట్టడి రాజేశ్, సంయుక్త కార్యదర్శి భూపతి, ప్రేమ్‌కుమార్, గంగాధర్, సురేశ్, రామ్, ప్రవీణ్, నిఖిత, నవ్య పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌లో ఇల్లు దగ్ధం

మంటలు ఆర్పివేస్తున్న స్థానికులు

ఇందల్వాయి, ఏప్రిల్ 7 : మండలంలోని చంద్రాయన్‌పల్లిలో పంచాయతీ కార్మికుడిగా పనిచేసే బర్దిపూర్ గంగారాం ఇల్లు ఆదివారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లోని తులంనర బంగారం, లక్ష రూపాయల నగదు, నిత్యావసర సరుకులు కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఇంటిని పరిశీలించారు. బాధిత కుటుంబంతో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తరపున సహాయం అందజేస్తామని హామీఇచ్చారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, సంతోష్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు. బాధిత కుటుంబాన్ని ఎంపీపీ రమేశ్ నాయక్ పరామర్శించి, రూ. 5 వేలు, క్వింటాలు బియ్యం అందజేశారు.

బీఆర్ఎస్ హయాంలోనే మైనార్టీల సంక్షేమం

కోటగిరిలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

కోటగిరి/ రుద్రూర్, ఏప్రిల్ 7 : బీఆర్ఎస్ హయాంలోనే మైనార్టీల సంక్షేమం జరిగిందని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. కోటగిరి మండల కేంద్రంలో బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పోచారం శ్రీనివాసరెడ్డి తోపాటు డీసీసీబీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎజాజ్‌ఖాన్, సిరాజ్, జడ్పీటీసీ సభ్యుడు శంకర్‌పటేల్, మహ్మద్ అబ్దుల్ హమీద్, పత్తి లక్ష్మణ్, సిద్ధు, నీరడి గంగాధర్, శ్రీధర్, ఉదయ్, అబీద్ అలీ, రఫీ, జుబేర్, బాబూఖాన్ మసూద్, శాంతేశ్వర్‌పటేల్, జుమ్మాఖాన్‌తో తదితరులు పాల్గొన్నారు.

రుద్రూర్ మండలకేంద్రంలోని పెద్ద మసీదులో విందో మాజీ చైర్మన్ పత్తి రాము ముస్లింలకు ఇఫ్తార్ విందును ఆదివారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి మండల నాయకులతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు నారోజి గంగారాం, విందో చైర్మన్ సంజీవ్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కన్వీనర్ సంగయ్య, కో-ఆప్షన్ సభ్యుడు మస్తాన్, అక్కపల్లి నాగేందర్, కోడె శంకర్, నర్సయ్య, సుబానీ, జలాల్, జమీల్ పాల్గొన్నారు.

బాసర అమ్మవారిని దర్శించుకున్న మున్సిపల్ కమిషనర్

అమ్మవారిని దర్శించుకుంటున్న మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్

బాసర, ఏప్రిల్ 7 : నిర్మల్ జిల్లాలోని బాసర సరస్వతీ అమ్మవారిని నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయానికి కుటుంబ సమేతంగా చేరుకున్న వారికి అధికారులు ఘనంగా స్వాగతించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు వైదిక బృందం తీర్థప్రసాదాలతోపాటు ఆశీర్వచనాలు అందజేశారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

అవగాహన కల్పిస్తున్న ఐఎంఏ ప్రతినిధులు

రక్తదానం చేస్తున్న జేసీఐ ప్రతినిధులు

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 7 : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటలకు నగరంలోని పాలిటెక్నిక్ మైదానంలో వాకర్స్‌కు ఆరోగ్యంపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు దామోదర్‌రావు, శ్రీశైలం మాట్లాడుతూ.. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే కాలినడక తప్పనిసరి అన్నారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని, ప్రతిరోజు కొంత వ్యాయామం చేయడంతో పాటు మానసిక ఒత్తిడి తగ్గించుకొని.. యోగా, ప్రాణాయామం చేయాలని సూచించారు. అనంతరం అంబలి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు రవీంద్రారెడ్డి, జీవన్‌రావు, ఫరీదాబేగం హరీశ్, స్వామి, నీలి రాంచందర్, జలగం తిరుపతిరావు, బండారి సుజాత, నాగమోహన్, వినోద్ కుమార్‌గుప్తా, రామ్మోహన్‌రావు, రమాదేవి, వాకర్స్ పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్7: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సామాజిక సేవకుడు పట్వారి తులసీ కుమార్ రూపొందించిన ఆహారం-ఆరోగ్యం అనే పోస్టర్‌ను చేయూత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ మధుశేఖర్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మధుశేఖర్ మాట్లాడుతూ ప్రజలు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఎండల తీవ్రత ఎక్కువైందని, వడదెబ్బ తగలకుండా, సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

జేసీఐ, ఇందూర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

వినాయక్‌నగర్, ఏప్రిల్ 7 : జిల్లాకేంద్రంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జేసీఐ- ఇందూరు ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. జోన్ ఉపాధ్యక్షుడు విజయానంద్ 45వ సారి రక్తదానం చేశారు. జేసీఐ ఇందూర్ అధ్యక్షుడు మనోజ్‌కుమార్, సభ్యులు మంచి శ్రీధన్, జైపాల్, నాగుల శ్రీధర్, నరేంద్ర స్వామి, అశోక్, భూపతి, నాగేందర్ తదితరులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో జోన్ ఆఫీసర్ నయన్, నిపుల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశం

- **హాజరుకానున్న బీఆర్ఎస్ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్**

ఇందల్వాయి, ఏప్రిల్ 7 : మండల పరిధిలోని గంగపుత్ర ఫంక్షన్ హాలులో బీఆర్ఎస్ కార్యకర్తలతో నేడు (సోమవారం) సమావేశం ఉంటుందని బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ఒక ప్రకటనతో తెలిపారు. బీఆర్ఎస్ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌తోపాటు మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ ఈ పార్లమెంట్ సన్నాహాక సమావేశానికి హాజరై మాట్లాడతారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి మండల, గ్రామ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ఉన్నత విలువలతో జీవించాలి

సంకీర్తన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ధర్పల్లి, ఏప్రిల్ 7 : ప్రతిఒక్కరూ భక్తితో, ఉన్నత విలువలతో జీవించాలని సత్యసాయి జిల్లా ఆధ్యాత్మిక కో-ఆర్డినేటర్ ఈశ్వర్ అన్నారు. మండలంలోని దుబ్బాకలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ.. ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించేందుకు గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. సత్యసాయి భక్తులు గ్రామంలో ఉదయం గ్రామ సంకీర్తన నిర్వహించారు. అనంతరం భక్తి ప్రవచనాలు చేశారు. మానవ జీవిత లక్ష్యం ఏమిటి అనే అంశంపై భక్తులకు వివరించారు. భక్తితోనే ప్రశాంతత అలవడుతుందన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కె. శ్రీనివాస్, మండల కన్వీనర్ మల్లగి శ్రీనివాస్, భక్తులు చిలుక శంకర్, శోభ, మచ్చ బుచ్చన్న, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ఉగాది పంచాంగం ఆవిష్కరణ

పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రతినిధులు

సుభాష్‌నగర్/ ఖలీల్‌వాడి, ఏప్రిల్ 7 : క్రోధి నామ సంవత్సర పంచాంగాన్ని తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం - ఇందూరు శాఖ అధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. జిల్లాకేంద్రంలోని ఆర్యనగర్‌లో ఉన్న సంఘ కార్యాలయంలో వేద పండితులు వేలేటి గౌరీ శంకర శర్మ, సంఘం అధ్యక్షుడు కిరణ్‌కుమార్ దేశ్‌ముఖ్ ఆవిష్కరించారు. పంచాగకర్తలు యల్లా ప్రగడ చంద్రశేఖర శర్మ, పాలెపు శ్యాంసుందర శర్మను ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రొట్టె సురేశ్, కోశాధికారి పుల్కల్ రమేశ్, సంఘ సభ్యులు మేడిచర్ల శ్రీనాథ్, కరణం సౌమ్యా భరద్వాజ్, ప్రకాశ్ కులకర్ణి, శైలజ, వీణ, కోస్లి, శంకర్‌రావు, చంద్రశేఖర్, గుండేరావు, లక్ష్మీనారాయణ భరద్వాజ్, లక్ష్మణ్ వైరాగర్, మంచికంటి శ్రీనివాస్‌రావు, పీఆర్వో రామ్మోహన్‌రావు, మల్లికార్జున్‌రావు, మాజీ సర్పంచ్ గుండేరావు దేశ్‌ముఖ్, యలమంచిలి వేణుగోపాల్, సంజీవ్ పండిత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాలులో జిల్లా పద్మశాలీ సంఘ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి అర్వింద్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి హాజరై ఒకే వేదికపై కూర్చుండడం చర్చనీయాంశమైంది. ఆహ్వానం అందిన కార్యక్రమాలకు అభ్యర్థులు హాజరై ప్రజలను పలుకరిస్తూ ప్రచారం చేసుకోవడం కలిసి వస్తున్నదని పలువురు చర్చించుకుంటున్నారు.

- వినాయక్‌నగర్, ఏప్రిల్ 7

ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రం అందజేత

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న రామ మందిర నిర్మాణ కమిటీ సభ్యులు

నవీపేట, ఏప్రిల్ 7: మండల కేంద్రంలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన సీతారామ చంద్ర స్వామి విగ్రహ యంత్ర ప్రతిష్ఠాపన ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి రామాలయ కమిటీ చైర్మన్ కరిపె మల్లేశ్ ఆధ్వర్యంలో సభ్యులు ఆదివారం మండల కేంద్రంలో ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 11 నుంచి 13 వరకు ఆలయ ప్రారంభత్సోవంతోపాటు విగ్రహ యంత్ర ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరిపె మల్లేశ్ పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎత్తిపోతల పథకంపై రైతులకు అవగాహన

ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న ఆర్మూర్, ముథోల్ ఎమ్మెల్యేలు రాకేశ్‌రెడ్డి, రామారావు పటేల్

నందిపేట్, ఏప్రిల్7: మండలంలోని వన్నెల్ లిఫ్ట్ ఇరిగేషన్‌ను ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ రైతులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ముథోల్ నియోజకవర్గంలో నూతనంగా త్వరలో ఎత్తిపోతల పథకం ప్రారంభించనున్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ పనితీరు, నిర్వహణ, దానిని ఎలా సద్వినియోగం చేసుకోవాలనే విషయాలను నిర్మల్ జిల్లా నుంచి వచ్చిన రైతులకు వన్నెల్ గ్రామ రైతులు వివరించారు. నీళ్లు ఎలా వాడాలి, పంటల కోసం ఏ సందర్భంలో వినియోగించుకోవాలి, ఆయకట్టు రైతులు అందరూ ఎలా ఉంటే లబ్ధి చేకూరుతుంది, చిన్నపాటి మరమ్మతులకు డబ్బులు ఎలా ఇవ్వాలి, సభ్యత్వం ఎలా తీసుకోవాలి అనే విషయాలను స్థానిక రైతులు వివరించారు. అనంతరం గోదావరి ఒడ్డున ఉన్న శివాలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ ఆర్మూర్ అసెంబ్లీ కన్వీనర్ రాజు, నాయకులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

నవీపేట, ఏప్రిల్ 7: వేసవి సందర్భంగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని మండలంలో ఆయా గ్రామాల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని నవీపేట, బినోలా ప్రభుత్వ వైద్యులు కావ్య, సామ్రాట్ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో సూచించారు. 25 రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువైందని పేర్కొన్నారు. ఎండ తీవ్రత నుంచి తట్టుకోవాలంటే ఓఆర్ఎస్ ప్యాకెట్లను వినియోగించుకోవాలని, జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.

అదృశ్యమైన బాలుడు...కారులో మృతి

రాఘవ(ఫైల్)

శక్కనగర్, ఏప్రిల్ 7: ఈ నెల 5వ తేదీన బోధన్ పట్టణం రాకాసిపేట్ ప్రాంతలో ఆరేండ్ల బాలుడు అదృశ్యంకాగా పరిసర ప్రాంతంలోని ఓ కారులో ఆదివారం సాయంత్రం మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గోసం బస్తీకి చెందిన రేణుక అనే మహిళ తన ఆరెండ్ల కుమారుడు రాఘవను తీసుకొని ఈ నెల 5వ తేదీన రాకాసిపేట్ హనుమాన్ మందిరం వద్ద కూలి పనులకు వెళ్లింది. కూలి పనులు చేస్తుండగా ఆడుకుంటానని బయటికి వెళ్లిన బాలుడు సాయంత్రం వరకు తిరిగి రాలేదు. బాలుడు కనిపించకపోవడంతో ఆమె బోధన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. రేణుక భర్త కూడా పలు ప్రాంతాల్లో బాలుడి కోసం గాలించాడు. ఆదివారం సాయంత్రం రాకాసిపేట్ ప్రాంతానికి చెందిన చంద్రశేకర్ అనే వ్యక్తి పొలం వద్దకు వెళ్లేందుకు పక్కనే ఉన్న తన కారును తీసేందుకు వెళ్లాడు. కారు వద్ద దుర్వాసన వచ్చింది. కారు డోర్ తెరిచి చూడగా వెనక భాగంలో బాలుడి మృతదేహం కన్పించింది. ఈ విషయంపై ఆయన వెంటనే బోధన్ పోలీసులకు సమాచారం అందించాడు. పట్టణ సీఐ వీరయ్య సంఘటన స్థలానికి వెళ్లి మృతిచెందిన బాలుడు రాఘవగా గుర్తించారు. ఆడుకునేందుకు వచ్చిన బాలుడు కారు డోర్ తీసి లోపలికి వెళ్లి డోర్ వేసుకొని ఉంటాడని, డోరు వెళ్లకపోవడంతో ఊపిరాడక మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బోధన్ పట్టణ సీఐ తెలిపారు.

తోటివారితో సోదరభావంతో మెలగాలి

రెవరెండ్ భాస్కర్‌ను సన్మానిస్తున్న చర్చి కమిటీ ప్రతినిధులు

శక్కర్‌నగర్, ఏప్రిల్7: బోధన్ పట్టణం శక్కర్‌నగర్‌లోని సీఎస్ఐ చర్చిని తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ ప్రధాన కార్యదర్శి రెవరెండ్ డాక్టర్ పి.భాస్కర్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన చర్చిలో ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులతో మాట్లాడారు. దేవుడిపై నమ్మకం, ఐక్యత, తోటి మనషులతో సోదర భావం తదితర అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయనను చర్చి కమిటీ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి ఫాదర్ రెవరెండ్ ప్రభాకర్, రెవరెండ్ చిట్టెన్ అనిల్, చర్చి ప్రతినిధులు జ్యోతిరాజ్, టివర్డ్, హెడ్‌వర్డ్ ముల్లర్ పుష్పరాజ్, కిశోర్‌కుమార్, ఆర్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

రెంజల్‌లో ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థుల

రెంజల్, ఏప్రిల్ 7: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపాల్ బలరాం తెలిపారు. ఉదయం నిర్వహించిన 6వ తరగతి పరీక్షలకు 162 మందికి గాను 139 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన 7 నుంచి 10 వరకు తరగతులకు 136 మందికి గాను 118 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈపరీక్షకు సీఎస్‌గా ఈశ్వర్, డీవోగా గొపీ వ్యావహరించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.

NT-311821-All

CHANGE OF NAME

I, MOHAMMAD ABDUL MUJEEB, R/o.H.No. 1-5-118/9/1, Zirayath nagar, Armoor, (D) Nzb Changed my name as ABDUL MUJEEB S/o. ABDUL MAQBUL

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నవీపేటలో మోటర్ సైకిల్ చోరీ

నవీపేట,ఏప్రిల్ 7: మండల కేంద్రంలోని ఓ కిరాణాషాపు నుంచి ఓ మోటర్ సైకిల్ చోరీకి గురైంది. నవీపేటకు చెందిన రామస్వామి తన కిరాణాషాపు ఎదుట టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోటర్ సైకిల్ పెట్టి తన వ్యాపారాన్ని చూసుకుంటున్నాడు. అటువైపు వచ్చిన ఓ గుర్తు తెలియని దొంగ షాపు ఎదుట నిలిపి ఉంచిన మోటర్ సైకిల్‌ను తీసుకొని పారిపోయాడు. మోటర్ సైకిల్‌ను తీసుకెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. బాధితుడు రామస్వామి ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి నుంచి ఫిర్యాదు అందిందని ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. నిందితుడి కోసం గాలిస్తున్నామని చెప్పారు. గతంలో పలు మార్లు మోటర్ సైకిళ్లు చోరీకి గురి కావడంపై మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మోటర్‌సైకిల్ ఎత్తుకెళ్తూ సీసీ కెమెరాలో రికార్డ్ అయిన నిందితుడు

అప్పుడు మూసి వేశారు.. ఇప్పుడు తెరిచారు

- **వాస్తు బాగాలేదని 2015లో మున్సిపల్ ప్రధాన గేటు మూసివేసి కంచె ఏర్పాటు**
- **వేదపండితుల సూచన మేరకు ప్రస్తుతం తొలగింపు**

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్7: ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయ ప్రధాన గేటును వాస్తుపేరుతో 2015లో మూసివేశారు. వేదపండితుల సలహా మేరకు ప్రస్తుతం మళ్లీ తెరిపించారు. స్వాతిసింగ్ బబ్లూ 2014 నుంచి 2019 వరకు మున్సిపల్ చైర్ పర్సన్‌గా కొనసాగారు. పదవి చేపట్టిన ఏడాది తర్వాత వేదపండితుల సలహా మేరకు మున్సిపల్ ప్రధాన ద్వారం నుంచి రాకపోకలను నిలిపివేసి కంచె ఏర్పాటు చేశారు. గత మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పవన్‌పై అవిశ్వాస తీర్మానం అనంతరం నూతన చైర్మన్ ఎంపిక ప్రకియ మూడున్నర నెలల పాటు కొనసాగింది. నూతనంగా వచ్చిన చైర్‌పర్సన్ లావణ్య వేదపండితుల సమహా మేరకు వాస్తురీత్యా కంచెను తొలగించి మళ్లీ ప్రధాన గేటు నుంచి రాకపోకలను ప్రారంభించారు.

గేటు వద్ద కంచెను తొలగించిన దృశ్యం